

జనవరిలో మీనాక్షి ఆలయ మహాకుంభాభిషేకం

● హైకోర్టుకు తెలిపిన ఆలయ అధికారులు



మదురై మీనాక్షి ఆలయం

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరిలో మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు హైకోర్టుకు తెలిపారు. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ కొత్త మండపం ప్రాంతంలోని వందకు పైగా దుకాణాలు తొలగించిన విషయం తెలిసిందే. ఈ కొత్త మండపాన్ని ఆధునీకీకరించి ప్రజల సందర్శనకు అనుమతించాలని కోరుతూ మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్ గురువారం విచారణ జరగ్గా మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ కుంభాభిషేకం 2026 జనవరిలో నిర్వహించాలని నిర్ణయించారని ఆలయం తరఫున హాజరైన న్యాయవాది పేర్కొన్నారు. దానికంటే ముందుగానే కొత్త మండపం ఆధునీకీకరిస్తామని వివరించారు. ఈ మొత్తం వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది.

గరుడసేవకు గొడుగుల సమర్పణ మహాభాగ్యం

● కెన్సెస్ అధినేత నరసారెడ్డి



ప్రత్యేక పూజలో కొండలపూడి నరసారెడ్డి-లక్ష్మీ దంపతులు

ప్యారీస్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు వేంకటేశ్వరస్వామి వారి గరుడ సేవకు గొడుగుల సమర్పణ మహాభాగ్యమని కెన్సెస్ అధినేత కొండలపూడి నరసారెడ్డి పేర్కొన్నారు. తిరుమల పుణ్యక్షేత్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడోత్సవం రోజున సమర్పించేందుకు నగరంలోని తిరుపతి అంబ్రెల్లా ఛారిటీస్ (టీయూసీ) ప్రత్యేకంగా 11 గొడుగులు సిద్ధం చేసింది. ఈ గొడుగులను ఈ నెల 25వ తేదీ నగరంలో ఊరేగించి వాహనంలో తిరుమలకు తీసుకెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో, గురువారం చింతాద్రిపేటలోని వెంకటేశ్వరపెరుమాళ్ ఆలయంలో శ్రీవారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన గొడుగులకు వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ముఖ్యఅతిథిగా నరసారెడ్డి-లక్ష్మీ దంపతులు పాల్గొని టీయూసీ నిర్వాహకులను అభినందించారు. ఈ పూజల్లో టీయూసీ ట్రస్టీ శీలం వరదరాజులు-నర్మదా దంపతులు, సినీ నటుడు కళాధర్ పార్థసారథి, శ్రీవారి భక్తులు, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

అబ్బే! ముఖం చాటెయ్యలా... చెమట తుడుచుకున్నా

● ఎడప్పాడి పళని స్వామి



మీడియా సమావేశంలో స్టాలిన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సెంథిల్‌బాలాజీని దూషించినప్పటి వీడియో ప్రదర్శిస్తున్న ఈపీఎస్

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలుసుకుని కారులో తిరిగి వెళుతూ తాను ముఖం చాటేశానంటూ వస్తున్న విమర్శల్ని అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) కొట్టిపారేశారు. చెమటపడితే రుమాలుతో తుడుచుకుంటూ వెళ్లానని, దానిపై ప్రసార మాధ్యమాలకు తోడు ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో గురువారం ఉదయం ఈపీఎస్ సమక్షంలో ఇతరపార్టీలకు చెందిన కొందరు అన్నాడీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జూలై 7 నుండి తాను చేపట్టిన ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వస్పందన లభిస్తోందని, ఇప్పటి వరకు 153 నియోజకవర్గాలలో పర్యటించానని చెప్పారు. పర్యటనలో ప్రజాస్పందన చూస్తుంటే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం కలుగుతోందన్నారు. ప్రతిపక్షంలో వున్నప్పుడు ప్రధాని నరేంద్రమోదీకి నల్లజెండాలు ప్రదర్శించిన డీఎంకే అధికారంలోకి వచ్చాక రెడ్‌కార్పెట్ స్వాగతం పలుకటంలో రహస్యమేంటని ప్రశ్నించారు. ఇటీవల తిరునల్వేలిలో కాంగ్రెస్ మహానాడు జరిగినప్పుడు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి చోడంకర్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 117 నియోజకవర్గాల్లో పోటీ చేయనుందని ప్రకటించారని, మాజీ టీఎన్‌సీసీ నేత కేఎస్ అళగిరి మాత్రం ఈ సారి డీఎంకే అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ అధికారంలో భాగస్వామ్యం కోరుతుందన్నారని గురు చేస్తూ.. ఈ విషయాలపై స్టాలిన్‌గానీ, ప్రసారమాధ్యమాలు గానీ పెద్దగా పట్టించుకోవడం లేదన్నారు. ఆ విషయాన్ని వదిలేసి తాను ఢిల్లీలో ముఖం చాటేశానంటూ అదేపనిగా విమర్శలు చేయడం సబబేనా అని ప్రశ్నించారు. తాను సీఎం పదవిని చేపట్టిన తర్వాత అన్నాడీఎంకే పాలన ఏ క్షణంలోనైనా కుప్పకూలుతుందని ప్రసారమాధ్యమాలన్నీ విమర్శించాయే తప్ప తనను ఏ మాత్రం ప్రోత్సహించలేదని విమర్శించారు. ఈ నెల 16న ఢిల్లీలో తమిళనాడు హౌస్ నుండి ప్రభుత్వం కేటాయించిన కారులోనే ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను కలుసుకునేందుకు వెళ్లానని, తనతోపాటు పార్టీ సీనియర్ నేతలు కూడా వచ్చారని గుర్తు చేశారు. అదే రోజు రాత్రి అమిత్‌షాను కలుసుకునేందుకు కూడా ప్రభుత్వ కారులోనే వెళ్లానన్నారు. అమిత్‌షాతో భేటీ ముగిశాక తాను బయటకు వచ్చి కారులో బయలుదేరుతూ చెమట పడితే ఖర్చీఫ్‌తో ముఖం తుడుచుకోవడాన్ని అటు ప్రసారమాధ్యమాలు, ఇటు స్టాలిన్ వివాదాస్పదంగా మార్చటం బాధాకరమన్నారు. కరూరు 'ముప్పెరుంవిళా' సభ ఏర్పాట్లను చేపట్టిన మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీపై స్టాలిన్ పొగడ్తల వర్షం కురిపించడం కూడా వింతగా ఉందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సెంథిల్ బాలాజీ వంటి అవినీతిపరుడు మరొకడు లేదని విమర్శించిన విషయాన్ని మరచిపోయినట్లుందని ఈపీఎస్ ఎద్దేవా చేశారు.

అన్ని పార్టీలకు వర్తించేలా నిబంధనలు

● పోలీస్ శాఖకు హైకోర్టు ఆదేశం



● బహిరంగ సభల్లో ప్రజల ఆస్తి నష్టానికి ఆయా పార్టీలదే బాధ్యత
● ముందుగానే కొంత డిపాజిట్ చేయించండి
● నూతన నిబంధనల్ని రూపొందించండి

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బహిరంగ సభల నిర్వహణలో అన్ని పార్టీలకు వర్తించేలా ఒకే రకమైన నిబంధనలు రూపొందించాలని రాష్ట్ర పోలీసు శాఖను మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. బహిరంగ సభల సందర్భంగా ప్రజా ఆస్తులకు నష్టం జరిగితే ఆయా పార్టీలదే బాధ్యత అని స్పష్టం చేసిన హైకోర్టు.. ఆ పరిహారాన్ని వసూలు చేసేందుకు ముందుగా కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయించాలని తేల్చి చెప్పింది. ఆ మేరకు నూతన నిబంధనల్ని రూపొందించాలని పోలీస్ శాఖను ఆదేశించింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సతీష్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తమ పార్టీ నేత విజయ్ రాష్ట్ర వ్యాప్త పర్యటన సందర్భంగా పోలీసులు కఠినమైన నిబంధనలు విధించారని, పక్షపాతం లేకుండా అన్ని పార్టీల్లాగే తమ ప్రచారానికి కూడా అవకాశం కల్పించేలా పోలీస్ శాఖను ఆదేశించాలంటూ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరగ్గా.. గత శనివారం విజయ్ తిరుచ్చిలో నిర్వహించిన ప్రచారానికి పోలీసులు 23 నిబంధనలతో అనుమతిచ్చారని, ఏ పార్టీకి లేని నిబంధనల్ని తమకు మాత్రమే విధిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ప్రచార సమయంలో ఎత్తయిన ప్రదేశాలు ఎక్కే కార్యకర్తలు కింద పడితే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీసింది. కార్యకర్తలను పార్టీ అధ్యక్షుడు నియంత్రించాల్సిన అవసరం లేదా అంటూ ప్రశ్నించింది. తిరుచ్చిలో విజయ్ పర్యటన సందర్భంగా దెబ్బతిన్న ప్రజల ఆస్తులకు నష్టపరిహారం వసూలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ.. ఆ డబ్బు వసూలు చేయనిపక్షంలో తాము జోక్యం చేసుకోవాల్సి వుంటుందని హెచ్చరించింది. అన్ని పార్టీలకు ఒకే విధమైన నిబంధనలు విధించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది.

ప్రజా సమస్యలపై చర్చిద్దాం... సమావేశాలు పొడిగించండి

పుదువై అసెంబ్లీలో విపక్షాల డిమాండ్ - డీఎంకే, కాంగ్రెస్ ఎమ్మెల్యే గెంటివేత





నేలపై బైఠాయించిన డీఎంకే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, వారిని గెంటివేస్తున్న మార్షల్స్

పుదుచ్చేరి, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు గురువారం ఉదయం స్పీకర్ ఆర్.సెల్వం అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ముందుగా ఇటీవల మరణించిన నేతలకు సంతాపం తెలిపారు. అనంతరం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే జి.నెహ్రూ ఓ సమస్యపై మాట్లాడటం ప్రారంభించారు. తర్వాత ప్రతిపక్షనేత ఆర్.శివతో పాటు డీఎంకే సభ్యులు, కాంగ్రెస్ సభ్యులు వైద్యనాథన్ తదితరులు నగరంలో సరఫరా అవుతున్న నీటిని తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారంటూ రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదేవిధంగా ప్రజాసమస్యలపై చర్చించేందుకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను మరో పదిరోజులు అదనంగా నిర్వహించాలని కేకలేశారు. ఈ సమయంలో కలుగజేసుకున్న స్పీకర్ సెల్వం సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్ష పార్టీ సభ్యులందరూ సహకరించి తమతమ స్థానాల్లో కూర్చోవాలని కోరారు. స్పీకర్ అభ్యర్థన పట్టించుకోని డీఎంకే, కాంగ్రెస్, ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు బైఠాయించి ధర్నా చేయడంతో వారిని సభ నుండి గెంటివేయాలంటూ మార్షల్స్‌కు ఆదేశించారు. సభలో ప్రతిపక్ష సభ్యుల మాటలను రికార్డుల నుండి తొలగించాలని స్పీకర్ సెల్వం ఉత్తర్వులు జారీచేశారు.

ఎయిర్‌పోర్టులో లగేజీ తనిఖీలో జాప్యం

● ఆలస్యంగా బయల్దేరిన విమానాలు

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కంలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల తనిఖీల్లో జాప్యం జరగడంతో పలు దేశాలకు వెళ్లాల్సిన విమానాలు ఆలస్యంగా బయల్దేరాయి. గురువారం ఉదయం సింగపూర్, దుబాయ్, థాయ్‌లాండ్, హాంగ్‌కాంగ్ తదితర దేశాలకు వెళ్లేందుకు ప్రయాణికులు విమానాశ్రయానికి చేరుకున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు వారి లగేజీ తనిఖీ చేయడంలో జాప్యం చోటుచేసుకుంది. ప్రయాణికులు తనిఖీ తనిఖీ తరువాత విమానాల వద్దకు వెళ్లేందుకు సమయం పట్టడంతో, ఆయా దేశాలకు వెళ్లే విమానాలు గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరాయి. అలాగే హైదరాబాద్, పూనే, తూత్తుకుడి నగరాలకు వెళ్లాల్సిన విమానాలు మూడు గంటలు ఆలస్యంగా బయల్దేరాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా పలు నగరాల నుంచి చెన్నై రావాల్సిన విమానాల రాకపోకల్లో జాప్యం జరిగినట్టు అధికారులు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంకండి

● పార్టీ శ్రేణులకు ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్ పిలుపు



కమల్‌హాసన్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ నేతలు

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేలా ప్రచారం కూడా చేపట్టాలని 'మక్కల్ నీదిమయ్యం' (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్‌హాసన్ పిలుపునిచ్చారు. రాజా అన్నామలైపురంలోని ముత్తమిళ్‌పేరవై టీఎన్ రాజరత్తినం హాలులో గురువారం ఉదయం జరిగిన పార్టీ నిర్వాహకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశంలో చెన్నై జోన్ కార్యదర్శి మయిల్‌వాహనన్ సహా 17 జిల్లాలకు చెందిన కార్యదర్శులు, 26 శాసనసభ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు హాజరయ్యారు. సాయంత్రం కాంచీపురం జోన్ జిల్లా కార్యదర్శులు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ డీఎంకే కూటమిలోనే మక్కల్ నీదిమయ్యం కొనసాగనుందని, ఆ కూటమిని గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు, బూత్‌కమిటీల ఇన్‌ఛార్జులు శాయశక్తులా పాటుపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాను డీఎంకే అధిష్టానం సూచించే ప్రాంతాల్లో ప్రచారం చేస్తానని, ఆ పర్యటన వివరాలను కూడా త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేయాల్సిన ప్రచార వ్యూహాలపై కూడా పార్టీ జిల్లా కార్యదర్శులు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణాచలం, ఉపాధ్యక్షులు ఏజీ మౌర్యా, ఆర్ తంగవేలు, సెంథిల్ ఆరుముగం, మురళీ అబ్బాస్, యువజన విభాగం కార్యదర్శి కవి స్నేహన్, ఐటీ విభాగ కార్యదర్శి లక్ష్మణ్, మహిళా విభాగం కార్యదర్శి స్నేహా మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

21న నడిగర్ సంఘం సర్వసభ్య సమావేశం




నాజర్, విశాల్


అడయార్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత నటీనటుల సంఘం (నడిగర్ సంఘం) 69వ సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీ జరుగనుంది. తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో జరిగే ఈ సమావేశానికి ఆ సంఘం అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తి, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరుణాస్, నడిగర్ సంఘ కార్యవర్గం, సర్వసభ్య సభ్యుల సహా 3 వేల మంది హాజరుకానున్నారు. ఉదయం 8.30 గంటలకు కార్యవర్గ సమావేశం, ఆ తర్వాత సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇందులో నడిగర్ సంఘ నూతన భవన ప్రారంభోత్సవం, సంఘం ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై చర్చించన్నారు. ప్రధానంగా నడిగర్ సంఘానికి ప్రతి మూడేళ్ళకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే 2019లో జరిగిన ఎన్నికల ఫలితాలను న్యాయపరమైన చిక్కుల కారణంగా 2022లో వెల్లడించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా నాజర్, ప్రధాన కార్యదర్శిగా విశాల్, కోశాధికారిగా కార్తిలతో పాటు వారి బృందం ఎంపికయ్యారు. ఈ కమిటీ కాలపరిమితి గత మార్చితో ముగిసిపోయింది. అయితే, నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తయ్యేంత వరకు ప్రస్తుత కార్యవర్గమే తదుపరి మూడేళ్ళు కొనసాగేలా గత సర్వసభ్య సమావేశంలో ఒక తీర్మానం చేసి ఆమోదించగా, దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఎన్నికలు నిర్వహించేందుకు వచ్చిన సమస్యలేంటో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను వచ్చే నెల 15వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు చిత్రపరిశ్రమలో అడుగుపెట్టి 50 యేళ్ళు పూర్తి చేసుకున్న రజనీకాంత్‌కు, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన కమల్ హాసన్‌ను సన్మానించేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని నడిగర్ సంఘం భావిస్తోంది. దీనిపై కూడా చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

కరూరు జిల్లా కోడంగిపట్టిలో రూ.11.87 కోట్లతో ఏర్పాటు చేసిన మినీ టెక్స్‌టైల్ పార్కును గురువారం ప్రారంభిస్తున్న మంత్రి ఆర్ గాంధీ





వైగై డ్యాం నీటి విడుదల



నీటిలో పూలు చల్లుతున్న మంత్రి మూర్తి

ప్యారీస్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): దిండుగల్, మదురై, శివగంగ, జిల్లాలకు వైగై డ్యాం నుంచి సాగునీటిని గురువారం ఉదయం వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్‌శాఖ మంత్రి మూర్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, పెరియార్ ఆయకట్టు పరిధిలో లక్షా 5వేల రెండు ఎకరాలకు సాగునీరు సరఫరా చేయాలని దిండుగల్, శివగంగ జిల్లాల రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని తెలిపారు. వైగై డ్యాం నుంచి సెకనుకు 1,130 ఘనపుటడుగుల నీరు విడుదలవుతోందని, మొత్తం 120 రోజుల పాటు సాగునీరు విడుదల చేయనున్నట్లు మంత్రి వివరించారు. మంత్రితో పాటు మూడు జిల్లాల కలెక్టర్లు రంజిత్‌సింగ్, కేజే.ప్రవీణ్‌కుమార్, ఎస్.శరవణన్, తేని ఎంపీ తంగతమిళ సెల్వన్, చీఫ్ ఇంజనీర్ శివప్రభాకరన్, రైతులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

స్థానిక సంస్థలకు రూ.127 కోట్లు విడుదల

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు 15వ ఫైనాన్స్ కమిషన్ సబ్సిడీగా రూ.127.58 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులు 2,901 గ్రామ పంచాయతీలు, 74 పంచాయతీ యూనియన్లు, 9 జిల్లా పంచాయతీల్లో మౌళిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు ప్రైవేటు జాబ్ మేళా

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని ఉపాధి కల్పన కేంద్రంలో శుక్రవారం ప్రైవేటు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ఈ శిబిరంలో 8,10, ప్లస్ టూ, ఐటీఐ, డిప్లొమో, ఇంజనీరింగ్, ఆర్ట్స్ సైన్స్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చు. ఈ శిబిరంలో పలు ప్రైవేటు సంస్థలు పాల్గొని ఖాళీగా ఉన్న పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయని కలెక్టర్ తెలిపారు.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కావేరి నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు నీటి రాక తగ్గింది. బుధవారం సాయంత్రం డ్యాంకు 8,641 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, గురువారం ఉదయం 8,342కు తగ్గింది. ప్రస్తుతం డ్యాంలో 119.75 అడుగులతో 91.49 టీఎంసీల నీటినిల్వలున్నాయి. డెల్టా జిల్లాలకు డ్యాం నుంచి 13,800 ఘనపుటడుగుల సాగు నీరు విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

30న మాజీ సైనికుల గ్రీవెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లా పరిధిలోని మాజీ సైనికుల సమస్యల పరిష్కార శిబిరం ఈ నెల 30వ తేది జరుగనుందని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ శిబిరంలో చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ మాజీ సైనికుల నుంచి వినతులు స్వీకరించనున్నారని కలెక్టర్ కార్యాలయం తెలియజేసింది.

రేపు, ఎల్లుండి డీఎంకే ఆధ్వర్యంలో బహిరంగ సభలు

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 20,21 తేదీల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు డీఎంకే తెలిపింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... 'తమిళనాడును తల దించనివ్వం' పేరుతో ఈ నెల 20న కాంచీపురం ఉత్తరంలో జరిగే సభలో ఎంపీ టీఆర్ బాలు ప్రసంగించనున్నారు. అలాగే, తిరువారూరులో కేఎన్ నెహ్రూ, కరూర్‌లో తిరుచ్చి శివ, కోవై ఉత్తరంలో ఎ.రాజా నేతృత్వంలోను, తూత్తుకుడి, కన్నియాకుమారిలో నిర్వహించే బహిరంగ సభల్లో ఎంపీ కనిమొళి ప్రసంగిస్తారని పార్టీ ప్రధాన కార్యాలయం తెలిపింది.

స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ పెంపు

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల నెలవారీ పింఛన్ రూ.21వేల నుంచి రూ.22వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, సమరయోధుల వారసులకు ఇచ్చే కుటుంబ పింఛన్ రూ.11,500 నుంచి రూ.12వేల పెరిగింది. 1966 అక్టోబరు 1 నుంచి స్వాతంత్ర్య సమరయోధులకు రాష్ట్ర ప్రభుత్వం నెలవారీ పింఛన్ అందజేస్తోంది. ప్రారంభంలో నెలవారీ పింఛన్ రూ.50 ఉండగా, విడతలవారీగా పెంచుతూ 2024 ఆగస్టు 15వ తేది నుంచి రూ.21వేలకు పెంచింది. సమరయోధుల వారసులు భార్య, భర్త, మైనర్ పిల్లలకు నెలవారీ కుటుంబ పింఛన్‌గా రూ.11,500 అందజేస్తున్న నేపథ్యంలో, పింఛన్ పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. 1వ మండలం 7వ వార్డు తిరువొత్తియూర్ కేసీపీ రోడ్డు సమీపంలోని కేజీ వర్షిణి అవెన్యూ, 3వ మండలం 28వ వార్డు ఎమ్మార్‌హెచ్ రోడ్డులోని సెబిస్టియన్ చర్చి, 4వ మండలం 40 వార్డు తండయార్‌పేట ఇల్లయ వీధిలోని ఎస్ఎస్ మహల్, 7వ మండలం 90వ వార్డు వందడుగుల రోడ్డు సమీపంలోని కేఎం రాయల్ మహల్ క్రిస్టల్ ప్యాలెస్, 8వ మండలం 103వ వార్డు అన్నా నగర్ 7వ మెయిన్ రోడ్డులోని జిమ్ బిల్డింగ్, 9వ మండలం 115వ వార్డు రాయపేట జాని జాని ఖాన్ రోడ్డులోటని ప్రెజెంటేషన్ చర్చి కమ్యూనిటీ హాలు, 10వ మండలం టి.నగర్ ఉస్మాన్ రోడ్డులోని ఎమ్మెల్యే ఆఫీస్ కాంప్లెక్స్‌లో శిబిరాలు జరుగనున్నాయి. 13వ మండలం 173వ వార్డు వెంకటరత్నం నగర్‌లోని క్రీడా మైదానం, 14వ మండలం 190వ వార్డు పళ్లికరనై వేళచ్చేరి మెయిన్ రోడ్డు నీలా మహల్, 15వ మండలం 197వ వార్డు అక్కరై ఈసీఆర్ రోడ్డు సమీపంలోని జనరాజన్ కల్యాణ మండపం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

కొడుముడి ప్రభుత్వ ఆస్పత్రిలో

ఆరోగ్య మంత్రి ఆకస్మిక తనిఖీ

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా కొడుముడి ప్రభుత్వ ఆస్పత్రిని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం తనిఖీ చేశారు. కరూరులో బుధవారం సాయంత్రం జరిగిన డీఎంకే ముప్పెరుంవిళాలో పాల్గొన్న సుబ్రమణ్యం గురువారం ఉదయం కొడుముడి చేరుకున్నారు. ఆ సందర్భంగా ఆయన వాకింగ్‌కు వెళ్తూ దారిలోనే ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలోకి వెళ్ళి తనిఖీ చేశారు. హాజరుపట్టీని పరిశీలించి సకాలంలో డ్యూటీకి వచ్చిన వైద్యుల వివరాలను తెలుసుకున్నారు. ఎక్స్‌రే, శస్త్రచికిత్సా విభాగాలను సందర్శించారు. ఇన్‌పేషంట్లు, ఔట్ పేషంట్ల వద్దకు వెళ్ళి ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు లభిస్తున్నాయా అని ఆరా తీశారు. ఆసుపత్రిలో ఏవైనా కొరత ఉంటే తనకు ఫిర్యాదు చేయవచ్చునని మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.



ఆస్పత్రి బయట రోగుల బంధువులతో మాట్లాడుతున్న మంత్రి సుబ్రమణ్యం

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో వ్యక్తి మృతిచెందిన ఘటన కళ్లకుర్చి జిల్లాలో చోటుచేసుకుంది. కూత్తకుడి శివాలయం ప్రాంగణంలో మర్రిచెట్టులో తేనె పట్టు ఉంది. మంగళవారం సాయంత్రం కొందరు ఆకతాయిలు గూడుపై రాళ్లు రువ్వడంతో ఎగిరిన తేనెటీగలు, అదే గ్రామానికి చెందిన కారు డ్రైవర్ వీరాస్వామి (45) సహా పదిమందిపై దాడిచేశాయి. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందిన పదిమంది బుధవారం డిశ్చార్జి అయ్యారు. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వీరాస్వామి హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతనిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక మృతిచెందాడు.

అత్యాచారం కేసులో పినతండ్రికి 35 ఏళ్ల జైలు

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన పినతండ్రికి కోర్టు 35 ఏళ్ల జైలుశిక్ష విధించింది. తిరువళ్లూర్ జిల్లా పట్టాభిరామ్ అన్నా నగర్‌లో వినోద్ (39) ధనలక్ష్మి దంపతులు నివశిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి బంధువుల కుమార్తె (14)పై 2018లో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బంధువులకు తెలిసిన వెంటనే భవన నిర్మాణ పనులంటూ వినోద్ విదేశాలకు వెళ్లిపోయాడు. 2019లో దీనిపై నిందితుడి భార్య పట్టాభిరామ్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో, 2021 జనవరిలో దుబాయ్ నుంచి తిరుచ్చి విమానాశ్రయానికి చేరుకున్న వినోద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు తిరువళ్లూర్ జిల్లా పోక్సో కోర్టులో విచారణలో ఉంది. ఈ క్రమంలో, బాధితురాలు 2021 ఆగస్టులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసు విచారణ ముగియడంతో నిందితుడు వినోద్‌కు 35 ఏళ్ల జైలుశిక్ష, రూ.40,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉమామహేశ్వరి బుధవారం తీర్పునిచ్చారు. అలాగే, బాలిక పిన్నమ్మకు పరిహారంగా రూ.5 లక్షలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయమూర్తి సిఫారసు చేశారు.

కారుతో యువకుడిని ఢీకొట్టిన ఎస్ఐపై సస్పెన్షన్ వేటు



ఎస్ఐ కారు బ్యానెట్‌పై నిలిచి కేకలు పెడుతున్న అశోక్‌కుమార్, సస్పెండ్ అయిన ఎస్ఐ గాంధీరాజన్

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో బుధవారం రాత్రి మద్యం మత్తులో బైకుపై వెళుతున్న యువకుడిని కారుతో ఢీకొట్టిన ట్రాఫిక్ విభాగం ఎస్ఐపై సస్పెన్షన్ వేటు పడింది. తూత్తుకుడి జిల్లా కయిత్తారుకు చెందిన గాంధీరాజన్ (59) తిరునల్వేలిలో ట్రాఫిక్ విభాగం ఎస్‌గా పనిచేస్తున్నారు. సుద్దమల్లి ప్రాంతంలో నివసిస్తున్న గాంధీరాజన్ ఓపెన్‌హార్ట్ సర్జరీ చేసుకోవడంతో తన సొంత కారులోనే డ్యూటీకి వెళుతుంటారు. ఆ నేపథ్యంలో బుధవారం రాత్రి డ్యూటీ ముగించుకుని తిరునల్వేలి టౌన్ సౌత్ మౌంట్‌రోడ్డు మీదుగా కారులో ఇంటికి బయలుదేరారు. ఓ థియేటర్ వద్ద ఆ కారు ముందు వెళుతున్న బస్సు సడెన్ బ్రేక్ వేయడంతో ఆ బస్సు వెనుక వెళ్తున్న బైకును ఎస్ఐ గాంధీరాజన్ కారు ఢీకొంది. దీంతో ఆ బైకును నడిపిన అశోక్‌కుమార్ అనే యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. దీనితో అశోక్‌కుమార్ కోపంగా గాంధీరాజన్‌ను దూషించి, కారు ముందు బ్యానెట్‌పైకి ఎక్కాడు. దీంతో ఎస్ఐ గాంధీ రాజన్ కారు వేగాన్ని పెంచి బ్యానట్‌పై నిలబడిన అశోక్‌కుమార్ కిందకు పడేసేందుకు ప్రయత్నించాడు. వాటిని పాదచారులెవరో వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో ఎస్ఐ గాంధీ రాజన్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఎస్ఐ గాంధీరాజన్, బైకు నడిపిన అశోక్‌కుమార్ మద్యం మత్తులో గొడవ పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

అక్రమ ఇసుక రవాణా... ముగ్గురి అరెస్ట్



పట్టుబడ్డ నిందితులు

వేలూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం సమీపం కౌండిన్య నదిలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ ప్రాంతంలో గత ఏడాదిగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు ప్రజల ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ నేతృత్వంలోని పోలీసులు నదీ పరివాహక ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి సమయంలో గుడియాత్తం భువనేశ్వరిపేట సమీపంలో ఇసుక అక్రమంగా ఎడ్ల బండ్లలో తరలిస్తున్న ముగ్గురిని తనిఖీ చేశారు. ఇసుక తవ్వకాలకు సంబంధించిన ఎటువంటి అనుమతి లేనందున ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులకు నిందితులు శ్రీనివాసన్ (24), తరుణ్ (23), కృపాకరన్ (21)లుగా గుర్తించి కేసు నమోదు చేసి జైలు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

లంచం తీసుకుంటూ సర్వేయర్ సహా అసిస్టెంట్ అరెస్ట్



సర్వేయర్ జీవిత

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టాలో పేరు మార్చేందుకు లంచం ఆశించిన సర్వేయర్ కటాకటాల పాలైంది. సేలం జిల్లా నావకుర్చి గ్రామానికి చెందిన జీవిత 2023లో గ్రూప్-4 పరీక్షలో ఉత్తీర్ణురాలై, సర్వేయర్ పోస్టుకు ఎంపికైంది. ప్రస్తుతం ఆమె ఆత్తూర్ తాలూకా కార్యాలయంలో భూ సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు అసిస్టెంట్‌గా కన్నదాసన్ (48) వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో, ఆత్తూర్ తాలూకా తులుక్కనూర్ గ్రామానికి చెందిన రైతు కుమరేశన్ ఇటీవల కొనుగోలు చేసిన ఇంటి పట్టాలో పేరు మార్చాలని కోరుతూ సర్వేయర్ జీవితకు దరఖాస్తు చేసుకున్నాడు. పట్టాలో పేరు మార్చేందుకు రూ.12 వేలు ఇవ్వాలని, ముందుగా రూ.10 వేలు చెల్లించాలని ఆమె అసిస్టెంట్ కన్నదాసన్ తెలిపాడు. దీంతో కుమరేశన్, సేలం జిల్లా ఏసీబీ అధికారులు ఆశ్రయించాడు. వారి సూచన మేరకు రసాయనాలు పూసిన నోట్లను, బుధవారం ఆత్తూర్ తాలూకా కార్యాలయంలో సర్వేయర్ జీవిత, అసిస్టెంట్ కన్నదాసన్‌లకు అందిస్తుండగా, అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు వారిద్దరినీ పట్టుకుని విచారిస్తున్నారు.

● బాలుడి కిడ్నాప్ కేసు...

ఎమ్మెల్యే జగన్‌మూర్తికి ముందస్తు బెయిల్



ఎమ్మెల్యే జగన్‌మూర్తి

ప్యారీస్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలో బాలుడి కిడ్నాప్ కేసులో సంబంధమున్న కేవీ కుప్పం ఎమ్మెల్యే జగన్‌మూర్తికి సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ ఖరారు మంజూరు చేసింది. తిరువలంగాడు సమీపంలోని కలాంబాక్కంలో ప్రేమ వ్యవహారంలో 17యేళ్ల బాలుడి కిడ్నాప్ చేయడంలో జగన్‌మూర్తికి సంబంధాలున్నాయని పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. మద్రాస్ హైకోర్టు ఉత్తర్వుల మేరకు తిరువలంగాడు పోలీసులు జగన్‌మూర్తిని విచారించే దృశ్యాలు వీడియో తీశారు. ఈ నేపథ్యంలో, పోలీసులు తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతూ జగన్‌మూర్తి దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో ఆయన సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు గురువారం ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. పరిశీలించిన న్యాయస్థానం జగన్‌మూర్తికి ముందస్తు బెయిల్‌ను ఖరారు చేసింది.

కార్మికుల డిమాండ్లపై నిర్లక్ష్యం తగదు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం



ప్యారీస్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కార్మికుల డిమాండ్లను నెరవేర్చేందుకు ముందుకు రాకుంటే వారికి మద్దతుగా ఉద్యమించాల్సివస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం చేపడుతున్న పోరాటాలకు తమ పార్టీ మద్దతుగా ఉంటుందని, ఈ కార్మికుల కోరికలను నెరవేర్చడంలో తగిన శ్రద్ధచూపకుంటే తాము కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాల్సివస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ రవాణాశాఖ కార్మికులు 30రోజులకు పైగా తమ డిమాండ్ల సాధన కోసం నిరవధికంగా ఆందోళనల్లో పాల్గొంటున్నారని, వారి గురించి పట్టించుకోకపోవడం సరికాదన్నారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరం

వేలూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు కార్పొరేషన్ పరిధిలోని ఓట్టేరిలో ఉన్న కల్యాణమండపంలో గురువారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతలో ఉంగళుడన్ స్టాలిన్ కార్యక్రమం జరిగింది. అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యేకు వినతిపత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత, తాహసీల్దార్ వడివేలు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేబిస్‌తో పదో తరగతి విద్యార్థి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్క కరవడంతో పదో తరగతి విద్యార్థి మృతిచెందిన ఘటన ధర్మపురి జిల్లాలో చోటుచేసుకుంది. ఆరూర్ సమీపం జల్లుదు ప్రాంతానికి చెందిన పళనివేల్ కుమారుడు దినేష్ (15) సిత్తేరిలోని బోర్డింగ్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. కొద్ది నెలల క్రితం దినేష్‌ను వీధి కుక్క కరవగా, ఈ విషయం పెద్దగా పట్టించుకోలేదు. ఈ క్రమంలో, హఠాత్తుగా అనారోగ్యానికి గురైన దినేష్‌ను కుటుంబ సభ్యులు ఆరూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ధర్మపురి ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స ఫలించక గురువారం ఉదయం దినేష్ మృతిచెందాడు.

రామేశ్వరం జాలర్లకు రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏడుగురు రామేశ్వరం జాలర్ల రిమాండ్‌ను ఈ నెల 24వ తేది వరకు పొడిగిస్తూ శ్రీలంక న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 13న కచ్చాదీవి సమీపంలో చేపలు పడుతున్న ఏడుగురు జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. ఈ క్రమంలో, రామేశ్వరం జాలర్ల రిమాండ్‌ను మూడవ సారి శ్రీలంక న్యాయస్థానం పొడిగించింది.

పొన్నై చెరువులో పెరిగిన నీటి ఉధృతి



పెరిగిన నీటి ప్రవాహం

వేలూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): రెండు వారాలుగా కురుస్తున్న భారీవర్షాలకు ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాలోని కలవగుంట డ్యాం నుండి వస్తున్న నీటిప్రవాహానికి పొన్నై చెరువులో నీటి ఉధృతి పెరిగింది. దీంతో పొన్నై చెరువు పరివాహక గ్రామాలైన కీల్‌నపాదనల్లూరు, తిరువళం, గుహయానల్లూరు, మాదండకుప్పం, తేనిపల్లి తదితర ప్రాంతాల ప్రజలను కలెక్టర్ సుబ్బులక్ష్మి అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో, పెరిగిన నీటి ప్రవాహాన్ని చూసేందుకు వెళ్లే పర్యాటకులకు అనుమతులు రద్దు చేశారు .నీటి ప్రవాహం రానున్న రెండు రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని చెరువుకట్ట ప్రాంతాల్లో ఉన్న రక్షిత ఆవాసకేంద్రాలను వెంటనే ప్రజల కోసం సిద్ధచేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.

తాటి చెట్లను నరకాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాటి చెట్లను నరకాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... పర్యావరణ పరిరక్షణకు తాటి చెట్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, కొండచరియలు విరిగిపడకుండా నిరోధించడంలో తాటి చెట్లు ముఖ్య భూమిక పోషిస్తాయి. కొందరు అక్రమార్కులు గృహ నిర్మాణాలు, ఇటుక బట్టీలో వినియోగానికి తాటి చెట్లను అక్రమంగా నరికివేస్తున్నారు. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన ప్రభుత్వం, తాటి చెట్ల నరికివేతకు కలెక్టర్ అనుమతి తప్పనిసరని జీవో జారీచేసింది. అలాగే, కలెక్టర్ అనుమతితో నరికిన తాటి చెట్లను మరో ప్రాంతానికి తీసుకెళ్లాలన్నా అనుమతి లేఖ తప్పనిసరి అని తెలిపింది. నిబంధనలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని ప్రభుత్వం జీవోలో హెచ్చరించింది.

వైభవంగా విశ్వకర్మ ఊరేగింపు



ఊరేగింపులో కమిటీ నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు బేరిపేటలోని కాళియమ్మన్ ఆలయంలో బుధవారం రాత్రి విశ్వకర్మ ఊరేగింపు ఘనంగా జరిగింది. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ఉత్సవంలో విశ్వబ్రాహ్మణ సంఘ కమిటీ సభ్యులు పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర విశ్వకర్మ కార్మిక సంఘం అధ్యక్షుడు విశ్వనాథన్ ఆచారి, అవై అధ్యక్షుడు రవి ఆచారి, సెక్రటరీ శ్రీనివాసన్, ట్రెజరర్ జగన్నాథన్ ఆచారి పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వారాంతపు సెలవులకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకార్యర్థం శుక్ర, శనివారాల్లో ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం 355 బస్సులు, శనివారం 350 బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 55 బస్సులు, మాధవరం టెర్మినల్ నుంచి శుక్ర, శనివారాల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఇవి మినహా, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర ప్రాంతాల నుంచి ఇతర నగరాలకు 200 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు.

రామేశ్వరంకు ప్రత్యేక బస్సులు...

మహాలయ అమావాస్య సందర్భంగా ఈనెల 20వ తేది (శనివారం) చెన్నై, సేలం, కోయంబత్తూర్, ఈరోడ్, తిరుప్పూర్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి రామేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. రామేశ్వరం నుంచి చెన్నై, సేలం, కోయంబత్తూర్, బెంగళూరు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అడయార్: కస్తూరిభాయ్ నగర్ 1వ మెయిన్ రోడ్డు మరియు క్రాస్ వీధి, నెహ్రూ నగర్ 1 నుంచి 4 వీధులు, భక్తవత్సలం నగర్ 2 నుంచి 5 వీధులు.

మాతూర్: చిన్నస్వామి నగర్, ఎంఎండీఏ మెయిన్ రోడ్డు, ఓమకుళం వీధి, శక్తి నగర్, నెహ్రూ నగర్, పెరుమాళ్ ఆలయ వీధి, టెలిగ్రామ్ నగర్, పెరియ మాతూర్, పుదు నగర్, మంజంబాక్కం, అనీస్ నగర్, అగర్సన్ కాలేజ్ రోడ్డు.

రెడ్‌హిల్స్: సేత్తుపెరుంబేడు, కిర్తలాపురం, పుదూర్, అరుమందై, విచూర్, మేట్టుపాళయం, కండిగై, వెల్లివాయల్, సెంబియం, ముత్తమిళ్ నగర్ 1 నుంచి 7 బ్లాక్‌లు, కొడుంగైయూర్ శ్రీనివాస పెరుమాళ్ వీధి, మీనంబాళ్ వీధి, గౌతమ్‌పురం హౌసింగ్ బోర్డు, పెరియార్ నగర్, వ్యాసర్పాడి, తిరుప్పూర్ కుమరన్ వీధి, ఎస్ఎస్‌వీ ఆలయ వీధి, ఎంపీఎం వీధి, సుబ్రమణి నగర్, అంజుగం నగర్, రామదాస్ నగర్, యునైటెడ్ కాలని, తిరుమలై నగర్, తిరుపతి నగర్, తనికాచలం నగర్, రామలింగం కాలని, కుమరన్ నగర్, రాయ్ నగర్, వెత్రి నగర్, వెత్రివేల్ నగర్, రెడ్‌హిల్స్ రోడ్డు, న్యూ కామరాజర్ నగర్, శక్తివేల్ నగర్, సమత్రియా కాలని, రాజా వీధి.

బోడినాయకనూరులో

సాగునీటి కోసం రైతుల ధర్నా



శంకరాపురం కూడలి వద్ద ధర్నా చేస్తున్న రైతులు

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముల్లై - పెరియార్ డ్యామ్ 18వ నెంబర్ కాలువ ద్వారా తేని జిల్లా బోడినాయకనూరు, ఉత్తమపాళయం, శంకరాపురం ప్రాంతాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ గురువారం ఉదయం రైతులు భిక్షాపాత్రలతో ధర్నా జరిపారు. ముల్లై - పెరియార్ డ్యామ్ నుండి విడుదల చేసే నీటితో ఐదు జిల్లాలలో సాగవుతోంది. తేని జిల్లా ఉత్తమపాళయం నుండి బోడియనాయకనూర్ దాకా ఉన్న 50కి పైగా గ్రామాలకు ఆ డ్యామ్ 18వ నెంబర్ కాలువ నుండి సాగునీటిని విడుదల చేస్తుంటారు. అయితే గత మూడేళ్లుగా ఆ కాలువ ద్వారా జలాలు విడుదల కావటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులు ఎన్నో మార్లు విజ్ఞప్తిచేసినా ప్రయోజనం లేకపోవటంతో బోడినాయకనూరు, శంకరాపురం రైతులు గురువారం ఆమరణ నిరాహారదీక్ష చేయడానికి సంకల్పించారు. పోలీసులు చివరి క్షణంలో అనుమతి నిరాకరించడంతో రైతులు భిక్షా పాత్రలతో ధర్నా జరిపారు.

సకాలంలో వ్యర్థాలను శుభ్రపరచండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీవర్షాలకు జనజీవనం స్తంభించింది. అదేవిధంగా వేలూరు కార్పొరేషన్ పరిధిలోని వీధుల్లో మురిగినీరు చేరడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం కలెక్టర్ సుబ్బులక్ష్మి వేలూరులోని గ్రీన్‌సర్కిల్ పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. వీధుల్లో నిలిచిపోయిన నీటిని, నేలకూలిన చెట్లను వెంటనే తొలగించి శుభ్రం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వేలూరు కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కనిమవలై ట్రస్ట్ పాఠశాల దశమ వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని కనిమవలై ట్రస్ట్ ప్రైమరీ పాఠశాల పదో వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాట్పాడి సేవా సంఘం అధ్యక్షుడు వేల్‌మురుగన్ పాల్గొనగా, విద్యార్థులకు పాఠశాల నిర్వాహకులు క్రీడా పోటీలు ప్రారంభించారు. అనంతరం విజేతలకు స్కూల్ నిర్వాహకులతో కలిసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీఎంకే ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరుతాం

● టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి

పెరంబూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి విజయం సాధించి మళ్లీ అధికారం చేపడితే, ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరతామని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) మాజీ అధ్యక్షులు కేఎస్ అళగిరి తెలిపారు. చిదంబరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... దేశంలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే, అందుకు మన రాజ్యాంగం కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టంలో కొన్ని కీలక అంశాలకు సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో కాంగ్రెస్ పోటీచేస్తుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో అదనపు సీట్లు కేటాయించాలని డీఎంకేను కోరుతామన్నారు. ఎన్నికల్లో డీఎంకే కూటమి విజయం సాధించి మళ్లీ అధికారం చేపడితే ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరుతామని కేఎస్ అళగిరి తెలిపారు.

ట్యాంకర్ లారీని ఢీకొన్న బస్సు

● కండక్టర్ మృతి, 30 మందికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన బస్సు

చెన్నై, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపం పొల్లాచ్చి సమీపంలో గురువారం వేకువజామున వేగంగా వెళుతున్న రాష్ట్ర రవాణా సంస్థ బస్సు రోడ్డు పక్కన ఉన్న ట్యాంకర్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్ కండక్టర్ ఘటనా స్థలంలో మృతి చెందగా, సుమారు 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. కోవై నుండి దిండుగల్‌కు రాష్ట్ర రవాణా సంస్థ బస్సు వేకువజాము 2.30 గంటలకు బయలుదేరింది. ఆ బస్సును దిండుగల్‌కు చెందిన డ్రైవర్ కాశిరాజన్ నడిపాడు. మూడు గంటల సమయంలో ఆ బస్సు పొల్లాచ్చిరోడ్డు ఆచ్చిపట్టి ప్రాంతంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ట్యాంకర్ లారీనీ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం నుజునుజ్జయ్యింది. బస్ కండెక్టర్ బాలసుబ్రమణి ప్రమాదస్థలంలోనే మృతి చెందగా 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరందరినీ చికిత్స నిమిత్తం పొల్లాచ్చి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పొల్లాచ్చియ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

తిరుత్తణి కొండపై పార్కింగ్ నిషేధం



వాహనాల పార్కింగ్ ప్రాంతంలో బారిగేట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

తిరుత్తణి, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి కొండపై నూతన పూజా సామగ్రి దుకాణాల పను ల కోసం గురువారం ఆల య ప్రాంగణాల్లో వాహనాల పార్కింగ్‌ను అధికారులు నిషేధించారు. ఈ క్రమంలో ఘాట్ రోడ్డు ఎంట్రన్స్‌లో బారిగేట్లు ఏర్పాటు చేసి వాహనాలు కొండపై పార్కింగ్ చేయకూడదని నోటీసు బోర్డులు పెట్టారు. దీనితో కొండపై సాధారణ రద్దీకంటే మూడురెట్లు అధిక రద్దీ నెలకొంది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు పార్కింగ్ కోసం వేరే ప్రాంతాలను ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయకుండా, ముందస్తు ప్రకటన చేయకుండా పార్కింగ్ నిషేధించడం సరికాదని వాపోయారు.

గ్రూప్-2, 2ఏ హాల్ టిక్కెట్లు విడుదల

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) నిర్వహించనున్న గ్రూప్-2, 2ఏ పరీక్షల హాల్ టిక్కెట్లు గురువారం విడుదలయ్యాయి. ఈ నెల 28వ తేది జరుగనున్న పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో, పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లను www.tnpsc.gov.in, www.tnpscexams.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు టీఎన్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది.

గర్భాలయగోపురం



స్థలవృక్షం (చెరకు)

(టి.నగర్, ఆంధ్రజ్యోతి)

జ్ఞాన యోగాలను ప్రసాదించే 'పట్టిణత్తార్'

● సాగరతీరంలో లింగరూపంలో సిద్ధపురుషుడు

రాజధాని నగరం చెన్నైలో ప్రాచీన కాలం నుండి ఎంతోమంది సిద్ధపురుషులు జీవ సమాధినొందారు. వీరంతా ప్రజలను సన్మార్గంలో నడిపినవారే. సదానందస్వామి, మౌనగురు స్వామి, చిదంబర స్వామి సహా యాభైమందికి పైగా సిద్ధపురుషులు నడయాడిన నగరమిదే. ఈ సిద్ధపురుషులలాగే కుబేరుడి అవతారమని భక్తులంతా భావించే 'పట్టిణత్తార్' కూడా పామరజనంలో ఆధ్యాత్మిక వెలుగులు నింపారు.

ఆలయ విశేషాలు...

సముద్రతీరానికి చేరువగా రాజగోపురం లేని ఆలయంలో పట్టిణత్తార్ శివలింగమేనితో నాగాభరణం ధరించి దర్శనమిస్తారు. గర్భాలయం ఎదురుగా నందీశ్వరుడు, ముఖమండపంలో వినాయకుడు, మురుగప్పెరుమాన్ విగ్రహాలున్నాయి. ప్రాకారంలోపల చండికేశ్వరస్వామి కూడా కొలువుదీరారు. పట్టిణత్తార్ జన్మదినమైన ఆడి ఉత్తరాడం నక్షత్ర దినాన ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. స్వామివారికి చక్కెర పొంగలి నైవేద్యంగా సమర్పిస్తుంటారు. పట్టిణత్తార్‌ను దర్శిస్తే సంతానం కలుగుతుందని చెబుతారు.



ఆలయ ప్రవేశద్వారం



లింగాకారంలో దర్శనమిస్తున్న పట్టిణత్తార్

కావేరిపూంపుహార్ పట్టినంలో ఆగర్భ శ్రీమంతుడి కుటుంబంలో జన్మించిన పట్టిణత్తార్‌తనకు దత్తపుత్రుడిగా అవతరించిన పరమేశ్వరుడి లీలావిశేషంతో సర్వసంగ పరిత్యాగిగా మారి దేశాటన చేస్తూ జ్ఞానయోగాన్ని అందించి మహాపురుషుడిగా కీర్తిగడించారు. సుమారు




ఆలయ ప్రధాన సన్నిధి

ఎనిమిది శతాబ్దాల క్రితం పట్టినత్తార్ ప్రస్తుతం నగర శివారు ప్రాంతమైన తిరువొత్తియూరులో సముద్రతీరాన జీవసమాధినొందిన ప్రాంతంలో ఓ ఆలయంలో శివలింగ రూపుడై భక్తులను అనుగ్రహిస్తున్నారు. తిరువొత్తియూరు క్షేత్రంలో తూర్పుదిశగా ఉన్న పట్టిణత్తార్ ఆలయాన్ని దర్శించుకుంటే జ్ఞానయోగాలు, సకల సౌభాగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

పట్టిణత్తార్ చరిత్ర...


కావేరిపూంపట్టినంలో శివనేసర్ అనే ధనవంతుడు నివసిస్తుండేవారు. ఆయన సతీమణి జ్ఞాన కళ అమ్మయార్. ఈ దంపతులకు పుత్రిక జన్మించింది. మగసంతానం కోసం దంపతులు ఎన్నో తీర్థయాత్రలు చేశారు. పరమేశ్వరుడి కృపతో ఆ దంపతులకు పుట్టిన బిడ్డకు తిరువెంగాడర్ అని పేరుపెట్టారు. ఆ బాలుడు ఐదేళ్ల ప్రాయంలో శివనేశర్ మృతి చెందారు. తల్లి పెంపకంలో తిరువెంగాడర్ నిత్యం శివభక్తులకు దానధర్మాలు చేస్తుండేవారు. సముద్రవాణిజ్యంలోనూ ఆరితేరారు. తిరువెంగాడర్‌కు యుక్తవయస్సు రాగానే శివకళై అనే యువతితో వివాహం జరిపించారు. ఈ దంపతులు సంతానం కలగలేదు. చివరకు తిరువిడైమరుదూరు క్షేత్రంలోని మరుదవానర్ పెరుమాళ్ (పరమేశ్వరుడే) ఆయనకు దత్తపుత్రుడయ్యారు. ఆ స్వీకారపుత్రుడికి 'మరుదవానర్' అని నామకరణం చేశారు. 16 యేళ్ల వయస్సులో మరుదవానర్ తండ్రి లాగే సముద్ర వ్యాపారం చేసి పేరుగడించారు. ఓ పర్యాయం మరుదవానర్ వజ్రాలు, ముత్యాలు కొనేందుకు నౌకలో విదేశీయాత్రకు బయలుదేరాడు. వజ్రవైఢూర్యాలు, ముత్యాలు కొనుగోలు చేసుకుని మరుదవానర్ స్వస్థలా



నికి తిరిగి వస్తుండగా తుఫాను వచ్చింది. ఈ విషయం తెలుసుకుని తిరువెంగాడర్ తన సుపుత్రుడు క్షేమంగా తిరిగిరావాలని పరమేశ్వరుడిని ప్రార్థించాడు. మరుసటి రోజు ఇంటికి చేరుకున్న మరుదవానర్ ఆవుపేడతో చేసిన పిడకల బస్తాలను పెరట్లో దించి, తండ్రి కోసం ఓ కానుక తెచ్చానని, ఓ అద్దాలపేటికను తల్లికిచ్చి అదృశ్యమవుతాడు. తిరువెంగాడర్ తన పుత్రుడు మరుదవానన్ విదేశాల నుంచి వెళ్ళి వజ్ర వైఢూర్యాలు తీసుకురాలేదని, పిడకల బస్తాలు తెచ్చాడనే ఆగ్రహంతో రెండు పిడకలను నేలకేసి కొట్టాడు. పగిలిన పిడకల నుంచి వజ్రాలు, ముత్యాలు రాలటం చూసి తిరువెంగాడర్ ఆశ్చర్యపోతాడు. అనవసరంగా కొడుకును తిట్టాననే బాధతో భార్య దగ్గరకు వెళ్ళి కుమారుడి కోసం అడుగుతాడు. మరుదవానన్ కాను



ఆలయ వెలుపలి ప్రకారం



పట్టిణత్తార్

కగా తెచ్చాడంటూ భర్త చేతిలో కొడుకు ఇచ్చిన అద్దాల పేటిక పెడుతుంది. ఆ పేటికను తెరచి చూడగా అందులో ఓ తాళపత్రం కనిపిస్తుంది. అందులో 'చెవి తెగిన సూది కూడా నీ వెంటరాబోదు' అని మరుదవానన్ రాసి ఉండటాన్ని చదివిన తిరువెంగాడర్ దిగ్భ్రాంతి చెందుతాడు. అప్పటికప్పుడు జీవితంపై విరక్తి చెందుతాడు. అంత్యకాలంలో తాను సంపాదించిన అష్టైశ్వర్యాలు, భార్యాపిల్లలు వెంటరారనే తత్వాన్ని మరుదవానర్ ఏక వాక్యంతో తెలియజేశాడని తిరువెంగాడర్ ఉన్న ఫళాన కౌపీనధారుడై సన్యాసిగా ఇంటి నుండి దేశాటనకు వెళ్ళిపోతారు. అప్పటి నుండి తిరువెంగాడర్‌ను భక్తులు పట్టిణత్తార్ అని పిలువసాగారు. దేశసంచారం చేస్తూ ఉజ్జయినిలో ఉన్నసమయంలో రాజభవనంలో నగలు దోచుకెళుతున్న దొంగలు పారిపోతూ ఓ బంగారు దండను గుడిలో నిద్రపోతున్న పట్టిణత్తార్ మెడలో వేసి వెళతారు. రాజభటులు గుడిలో పట్టిణత్తార్ మెడలో బంగారు దండ ఉండటాన్నిన గమనించి ఆయనే దొంగ అనుకుని బంధించి రాజు భద్రగిరి సమక్షంలో హాజరుపరస్తారు. రాజు ఎలాంటి విచారణ చేయకుండా పట్టిణత్తార్‌కు మరణశిక్ష విధిస్తారు. పట్టిణత్తార్‌కు మరణశిక్ష విధిస్తుండగా ఉరుములు మెరుపులతో జోరున వర్షం కురుస్తుంది. వర్షంలోనూ మంటలు చెలరేగి ఉరికొయ్య దగ్ధమవుతుంది. ఆ తర్వాత పట్టిణత్తార్ నిర్దోషి అని తెలుసుకున్న రాజు భద్రగిరి సకల సంపదలను విడిచిపెట్టి ఆయనకు శిష్యుడిగా సేవ చేసి మోక్షం పొందుతాడు. తన వద్ద శిష్యుడికి మోక్షమిచ్చిన పరమేశ్వరుడు తనకు ముక్తిని ప్రసాదించలేదని బాధపడుతున్న పట్టిణత్తార్ ఎదుట పరమేశ్వరుడు ప్రత్యక్షమై శ్రీకాళహస్తి క్షేత్రానికి వెళ్ళినప్పుడు ముక్తి కలుగుతుందని, చెరకు కొన ఎక్కడ తియ్యగా ఉంటుందో అక్కడే మోక్షం లభిస్తుందని తెలిపారు. ఆ ప్రకారమే పట్టిణత్తార్ శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించి తిరిగి వస్తున్నప్పుడు తిరువొత్తియూరు సముద్రతీరంలో ఇసుకలో ఏపుగా పెరిగిన చెరకు గడ కొసను కొరికినప్పుడు తియ్యగా అనిపించింది. దీంతో అక్కడే ఆయన జీవసమాధి చెందుతారు. పట్టిత్తార్ సమాధి అయిన స్థలంలో భక్తులు ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయంలో లింగాకారంలో పట్టిణత్తార్ భక్తులను అనుగ్రహిస్తున్నారు.



ఆలయ కుడ్యంపై ఉన్న 'చెవి తెగిన సూది కూడా నీ వెంటరాబోదు' అనే ఏక వాక్యానికి తాత్పర్యం

ఎలావెళ్ళాలి..?

నగరం నలుమూలల నుండి తిరువొత్తియూరుకు వెళ్లేందుకు బస్సులు ఉన్నాయి. గుమ్మిడిపూండి మార్గంలో వెళ్లే లోకల్ విద్యుత్ రైలులో తిరువొత్తియూరు చేరుకోవచ్చు. మెట్రోరైలు సదుపాయం కూడా ఉంది. ఉదయం 7నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటలవరకు ఆలయాన్ని తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

'రామ్‌రాజ్' నుంచి స్వయంవర గ్రాండ్

అడయార్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత సంప్రదాయ దుస్తుల తయారీలో దేశంలోనే అగ్రగామిగా ఉన్న 'రామ్‌రాజ్ కాటన్' ఆయా పండుగ సీజన్ల కు అనుగుణంగా వివిధ రకాలైన డిజైన్లతో నాణ్యమైన దుస్తులను కొనుగోలుదారులకు అందుబాటులో వుంచే విషయం తెలిసిందే. తాజాగా 'స్వయంవర గ్రాండ్' పేరుతో ప్రత్యేకమైన సిల్క్ ధోతీ, చొక్కా, టవల్ సెట్‌ను మార్కెట్లో విడుదల చేసింది. సమకాలీన స్పర్శతో సంప్రదాయానికి విలువనిచ్చే పురుషుల కోసం రూపొందించబడిన ఈ సేకరణ.. సంస్కృతి గర్వపడేలా వుంటుందని నిర్వాహకులు తెలిపారు. తిరుప్పూర్‌లో జరిగిన ఈ సెట్ ఆవిష్కరణ సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ ఛైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధునిక ప్రాధాన్యతలకు అనుగుణంగా కొన్ని దశాబ్దాలుగా స్వదేశీ వారసత్వాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. తాజాగా ఆవిష్కరించిన స్వయంవర గ్రాండ్ సంప్రదాయం పట్ల మనకున్న మక్కువను ప్రతిబింబిస్తుందన్నారు. జీవితంలో వచ్చే ఆనంద క్షణాలను మరింత మధురంగా జరుపుకునేలా వీటిని రూపొందించామన్నారు. తమ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా నటుడు రిషబ్ శెట్టి ఉండటం సంతోషకరమైన విషయమన్నారు. నటుడు రిషబ్ శెట్టి మాట్లాడుతూ.. నాణ్యత, కాలాతీత సంప్రదాయానికి పర్యాయపదమైన బ్రాండ్‌గా ఉన్న రామ్‌రాజ్ కాటన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడం గౌరవంగా ఉందన్నారు. స్వయంవర గ్రాండ్ అనేది కేవలం దుస్తులు మాత్రమే కాదని, వివాహాలు, పండుగలు వంటి విశేష రోజుల్లో మరింత చక్కదనాన్ని తెచ్చిపెడతాయని పేర్కొన్నారు.



నటుడు రిషభ్ శెట్టితో కలిసి 'స్వయంవర గ్రాండ్' ఆవిష్కరిస్తున్న కేఆర్ నాగరాజన్

సాయి ఆశ్రమ ట్రస్టుకు జీఆర్టీ రూ.55 లక్షల విరాళం



విరాళ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

అడయార్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో అగ్రశ్రేణి బంగారు ఆభరణాల కంపెనీల్లో ఒకటైన జీఆర్టీ జ్యూవెలర్స్ తన సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ)లో భాగంగా, సమాజానికి మేలు చేకూర్చే పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులోభాగంగా బెంగళూరులోని సాయి ఆశ్రమ ట్రస్టుకు రూ.55 లక్షలు విరాళంగా అందించింది. ఈ నిధులతో పిల్లలు, పేదలకు కార్డియాలజీ సేవల సహా ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాలను నిర్వహించడానికి దోహదపడుతుందని జీఆర్టీ జ్యూవెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, సమాజ సేవలో మా బాధ్యతలు వ్యాపారానికి అతీతంగా ఉంటాయని ప్రగాఢంగా విశ్వసిస్తున్నట్టు తెలిపారు. జీఆర్టీ జ్యూవెలర్స్ ఎండీ జీఆర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ, కొనుగోలుదార్లతో మా ప్రయాణం ఎల్లవేళలా నమ్మకం సుహృద్భావ వాతావరణంలో కొనసాగుతుందన్నారు. సాయి ఆశ్రమ ట్రస్ట్‌తో కలిసి వైద్య సేవలం కోసం విరాళం ఇవ్వండం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

విద్యారంగానికి నిధులు పెంచాలి

● వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి నిధులు పెంచాలని వీఐటీ యూనివర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ విజ్ఞప్తి చేశారు. వీఐటీ వర్సిటీ ప్రాంగణంలో అంతర్జాతీయ స్థాయిలో ఉపాధ్యాయులు, విద్యార్థుల పరస్పర బదిలీలపై రెండు రోజుల సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సదస్సును ప్రారంభించిన వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు చెందిన మంత్రులు, విద్యావేత్తలు, 27 దేశాలకు చెందిన ప్రొఫెసర్లు ఈ సదనస్సులో పాల్గొన్నారన్నారు. ఉన్నత విద్య వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. "న్ని దేశాలు విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. మన దేశ బడ్జెట్‌లో విద్యా రంగానికి 3 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని, కొన్ని దేశాలు 5 నుంచి 6 శాతం, మరికొన్ని దేశాలు 9 శాతం కేటాయిస్తున్నారన్నారు. విద్యా రంగానికి నిధులు పెంచితేనే పేదవర్గాలు ఉన్నత విద్య అభ్యసించే పరిస్థితి వస్తుందన్నారు. విద్యార్థులు ఇంగ్లీషు నేర్చుకోవాలని, ప్రపంచవ్యాప్తంగా మాట్లాడే భాష ఇంగ్లీషు అని ఛాన్సలర్ విశ్వనాథన్ తెలిపారు. సదస్సులో శ్రీలంక ఉన్నత విద్య కమిషనర్ గణేశనాథన్ కేతీశ్వరన్, మియన్మార్ ఉన్నత విద్యాశాఖ మంత్రి జోమింట్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకాగా, వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, కాంచన భాస్కరన్, అంతర్జాతీయ సంబంధాల ప్రతినిధి శ్రీనివాసన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న అతిథులు, నిర్వాహకులు

ప్రోస్టేట్ క్యాన్సర్‌పై నెల రోజుల ప్రచారం



చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రోస్టేట్ క్యాన్సర్ అవగాహనా మాసాన్ని పురస్కరించుకుని 'ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) చెన్నైలో ప్రోస్టేట్ క్యాన్సర్‌పై నెల రోజుల అవగాహనా ప్రచారాన్ని ప్రారంభించింది. ముఖ్యంగా 50 ఏళ్ల పైబడిన పురుషులు సకాలంలో స్క్రీనింగ్ చేయించుకోవాలని, సైలెంట్ కిల్లర్‌గా పిలువబడే ఈ వ్యాధి నిశ్శబ్దాన్ని ఛేదించాలని విజ్ఞప్తి చేసింది. గురువారం ఆస్పత్రిలో జరిగిన మీడియా సమావేశంలో ఏఐఎన్‌యూ చెన్నై చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్, యూరో అంకాలజిస్ట్ డాక్టర్ అరుణ్ కుమార్ బాలకృష్ణన్, రోబోటిక్ సర్జన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ డి.వెంకట్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. కొన్ని వయసు వర్గాల్లో ఏటా 5.6 శాతం ప్రోస్టేట్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయన్నారు. ప్రోస్టేట్ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చన్నారు. సాధారణ పీఎస్ఏ రక్త పరీక్ష, క్లినికల్ మూల్యాంకనం జీవిత గమనాన్ని మార్చగలదని వివరించారు.

మీడియా సమావేశంలో డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ వెంకట్ సుబ్రమణ్యం

జగదీష్ కడవుల్‌కు 'భారతీయ కళాచార సేవా మణి' అవార్డు



అవార్డు ప్రదానం చేస్తున్న కంచి పీఠాధిపతి

అడయార్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధార్మిక, సామాజిక కార్యక్రమాలతో సమాజానికి తన వంతు సేవ చేస్తున్న జగదీష్ కడవుల్‌కు 'భారతీయ కళాచార సేవా మణి' అవార్డు లభించింది. జిల్లా కేంద్రమైన తిరువణ్ణామలైలో హిందూ రిలీజియస్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఆధ్యాత్మిక సదస్సులో కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఈ అవార్డు అందజేశారు. డాక్టర్ పీటీ రమేష్ గురుక్కల్ కన్వీనరుగా ఉన్న హిందూ రిలీజియస్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగిన 'వేద ఆగమ దేవర స్పిరిచువల్ కల్చర్ కాన్ఫరెన్స్' లో పాల్గొన్న ఆధ్యాత్మికవేత్తలు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

కావేరి హాస్పిటల్‌కు హెచ్ఎంఏ అవార్డు

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కావేరి హాస్పిటల్‌కు 2025 సంవత్సరానికిగాను హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఆసియా (హెచ్ఎంఏ) ప్రతిభా పురస్కారం లభించింది. వియత్నాంలోని హోచ్‌మిన్ సిటీలో జరిగిన ఆ సంస్థ సదస్సులో వడపళని కావేరి హాస్పిటల్ మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పూర్ణచంద్రన్ ఈ అవార్డును స్వీకరించారు. అత్యుత్తమ నిర్వహణా పద్ధతులు అనుసరిస్తున్న ప్రైవేటు ఆస్పత్రుల్లో తమ ఆస్పత్రి ఆసియా స్థాయి అవార్డును అందుకోవటం తమకెంతో గర్వకారణంగా ఉందని కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ పేర్కొన్నారు.



హెచ్ఎంఏ నిర్వాహకుడి నుంచి అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ పూర్ణచంద్రన్

ఇళయరాజా 1,524వ చిత్రంగా 'ఆంటోనీ'

ప్రముఖ సంగీత దర్శకుడు, 'ఇసైజ్ఞాని' ఇళయరాజా సినీ కెరీర్‌లో 1,524వ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీకి 'ఆంటోనీ' అనే టైటిల్ ఖరారు చేశారు. ఇందులో 'కయల్' ఫేం విన్సెంట్, 'కాదలిక్క నేరమిల్లై' డీజే భాను ప్రధాన పాత్రలు పోషించారు. ఈలం తమిళులు, భారతీయ చిత్రపరిశ్రమకు చెందిన కొందరు టెక్నీషియన్లు కలిసి ఈ సినిమా నిర్మిస్తున్నారు. సుకీర్తన్ క్రీస్తురాజా, జెనోసన్ రాజేశ్వర్ ద్వయం దర్శకత్వ వహించింది. ఈ సినిమా గురించి దర్శక ద్వయం మాట్లాడుతూ, 'ఈలం తమిళులు, భారతీయ సినీ టెక్నీషియన్లు కలిసి నిర్మించే ఈ చిత్ర కథ వినగానే సంగీతం సమకూర్చేందుకు ఇళయరాజా మరోక్షణం ఆలోచన చేయకుండా అంగీకరించారు. జాఫ్నా నేపథ్యంలో సాగే లవ్‌స్టోరీకి ఇళయరాజా సంగీతం అందించడం ఆయన కెరీర్‌లో ఇదే తొలిసారి. చిత్రీకరణ పనులు పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది. ఓనై ఫిలిమ్స్, కురింజి క్రియేషన్స్ సంయుక్తంగా రిలీజ్ చేయనున్నాయి. ఆడియో, ట్రైలర్, సినిమా విడుదల తేదీని త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

చిత్రజ్యోతి



ఇళయరాజాకు గజమాలతో సన్మానం

ప్రముఖ హాస్య నటుడు రోబో శంకర్ ఇకలేరు

● అనారోగ్యంతో ఆస్పత్రిలో మృతి

కోలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రముఖ హాస్య నటుడు రోబో శంకర్(46) గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో కన్నుమూశారు. ఇటీవల అనారోగ్యం కారణంగా పెరుంగుడిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గురువారం మరణించినట్టు వైద్యులు ప్రకటించారు. శంకర్‌కు భార్య ప్రియాంక, కుమార్తె ఇంద్రజ ఉన్నారు. భార్య బుల్లితెర నటి కాగా, కుమార్తె ఇంద్రజ అగ్ర నటుడు విజయ్ నటించిన 'బిగిల్ చిత్రంలో పాండియమ్మ అనే పాత్రలో ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా మెప్పించారు. రోబో శంకర్ భౌతికకాయాన్ని వలసరవాక్కం, శ్రీదేవికుప్పంలో ఉన్న ఆయన స్వగృహానికి తరలించి, సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. విజయ్ టీవీలో ప్రసారమైన 'కలక్క పోవదు యార్' అనే షో ద్వారా రోబో శంకర్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అద్భుతమైన మిమిక్రీతో బుల్లితెర ప్రేక్షకుల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయన చుట్టి అరవింద్‌తో కలిసి ప్రదర్శించిన అనేక కామెడీ షోలు విశేష ప్రజాదారణ పొందాయి. అలాగే, వేదికలపై రోబో తరహాలో నృత్యం చేయడంతో ఆయన పేరు రోబో శంకర్‌గా స్థిరపడిపోయింది. స్టేజ్ షోలు చేస్తూనే సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో నటించారు. విజయ్ సేతుపతి నటించిన 'ఇదర్కుదానే ఆసైపట్టాయ్ బాలకుమార' అనే చిత్రంలో పూర్తి స్థాయి పాత్రలో నటించి శెభాష్ అనిపించుకున్నారు. ఆ తర్వాత 'కప్పల్', 'మారి', 'వాయై మూడి పేసవుమ్' వంటి అనేక చిత్రాల్లో నటించారు. కొంత కాలం క్రితం ఆయనకు కామెర్ల వ్యాధి సోకింది. దీంతో గణనీయంగా బరువు తగ్గారు. కోలుకున్న తరువాత తిరిగి సినిమాల్లో నటించారు. ఇటీవల మళ్ళీ అనారోగ్యానికి గురికావడంతో పెరుంగుడిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



రోబో శంకర్ (ఫైల్‌ఫోటో)

22 నుంచి ముక్కంటి ఆలయంలో
నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేవీ నవరాత్రులలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారు రోజు కొక అలంకారంలో దర్శనమివ్వనున్నారు. 22న కలశ స్థాపన, అమ్మవారి స్థల నిర్ణయం, శైలపుత్రి అలంకారం, 23న మహావిష్ణు ఉత్సవం, బ్రహ్మచారిణిదేవి అలంకరణ, 24న తపస్సు ఉత్సవం, చంద్ర ఘంటాదేవి అలంకారం, 25న కూష్మాండదేవి అలంకారం, 26న అశ్వాసుర వధ ఉత్సవం, స్కంధమాతదేవి అలంకారం, 27న వ్యాఘ్రాసుర వధ ఉత్సవం, కాత్యాయని దేవి అలంకారం, 28న రక్తబీజాక్షరి ఉత్సవం, శ్రీకాళరాత్రిదేవి అలంకారం, 29న బండాసుర వధ ఉత్సవం, మహాగౌరిదేవి అలంకారం, 30న మహర్నవమి ఉత్సవం, మహిషాసుర మర్ధిని అలంకరణ, 1న పార్వేట ఉత్సవం, విజయదశమి నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఈవో కోరారు.

టీటీడీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10 లక్షల విరాళం

తిరుమల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. విజయనగరానికి చెందిన కృష్ణ హరీశ్ ఈశ్వర విరాళం డీడీని తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



సర్వ దర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.2.86 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,213

తలనీలాలు సమర్పించినవారు: 29,410









శ్రీవారి ఆలయానికి లైటింగ్

బ్రహ్మోత్సవాలకు తొలి వెలుగులు



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఈక్రమంలో ఇప్పటికే తిరుమలలో చేసిన విద్యుత్ అలంకరణ పనితీరును గురువారం రాత్రి పరిశీలించారు. శ్రీవారి ఆలయ గోపురం, ప్రాకారం, ధ్వజస్తంభం, వెండివాకిలి, మహద్వారం వాకిలి వద్ద చేసిన విద్యుత్ లైట్లతో పాటు తిరుమలలోని పలు ప్రదేశాల్లో అమర్చిన కటౌట్లు, తోరణాల లైట్లను వెలిగించారు. గుర్తించిన లోటుపాట్లను సవరించారు. మరోసారి శుక్రవారం ఈ విద్యుత్ అలంకరణలను పరిశీలించనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి











రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అభ్యర్థులు



చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్ద బారులు తీరిన బస్సులు

బస్సులు బయలుదేరే సమయంలో
'అమరావతి' ప్రయాణం రద్దు

వెనుదిరిగిన డీఎస్సీ అభ్యర్థులు ● 1506 మంది రిజిస్ట్రేషన్.. వారి సహాయకులూ రాక ● భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాసేపట్లో బస్సులు బయలుదేరతాయనగా డీఎస్సీ అభ్యర్థుల అమరావతి ప్రయాణం రద్దయింది. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించతలపెట్టిన మైదానం వర్షం నీటితో నిండిపోవడంతో రద్దుచేసినట్టు అధికారులు ప్రకటించారు. దీంతో వీరంతా తిరుపతి నుంచి వెనుదిరిగారు. ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు అమరావతిలో శుక్రవారం నియామక పత్రాలు అందించే కార్యక్రమం చేపట్టారు. దీనికిగాను ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపికైన 1408 మంది, జోనల్ అభ్యర్థులు 124 మంది కలిపి 1532 మంది.. వారి సహాయకులను కలిపి మొత్తం 3064 మందిని అమరావతికి తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 86 బస్సులను కేటాయించారు. అందరినీ తిరుపతి- రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణానికి చేరుకుని రిజిస్ట్రేన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆ ప్రకారం ఉదయం 7 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రారంభించి 10.30 గంటలకు ముగించారు. మొత్తం 1532 మందికిగాను 1506 మంది ప్రయాణానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనారోగ్యం, ఇతర కారణాలవల్ల 26 మంది రాలేక అధికారుల అనుమతి తీసుకున్నారు. అభ్యర్థులు, వారి సహాయకులు 3,012 మందితో ఆ ప్రాంగణం రద్దీగా మారింది. ఓపక్క బారులు తీరిన బస్సులు, మరోపక్క వేలాదిమంది అభ్యర్థులు, వారి సహాయకులతో సందడి వాతావరణం నెలకొంది. అల్పాహార పంపిణీ తర్వాత 10.45 గంటల సమయంలో బస్సులు బయలుదేరేందుకు సిద్ధమయ్యాయి. ఆ సమయంలోఓ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు, తదుపరి కార్యక్రమ తేదీని మళ్లీ ప్రకటిస్తామని అమరావతి నుంచి అధికారులకు సమాచారం వచ్చింది. భారీ వర్షంతో అమరావతిలోని సభా ప్రాంగణంలో నీళ్లు చేరడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు. కాగా, దారి మధ్యలో 1600 మందికి గూడూరులో, మరో 1600 మందికి నెల్లూరులో భోజన ఏర్పాట్లు చేశారు. ప్రయాణం రద్దుకావడంతో ఆహార పదార్థాలు వృథాగా మారాయి.





కార్యక్రమం రద్దవడంతో వెనుదిరిగిన అభ్యర్థులు,సహాయకులు - చిన్నారితో వచ్చిన డీఎస్సీ అభ్యర్థి

తిరుమలకు తగ్గిన బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల కోసం ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏడు డిపోల నుంచి సప్తగిరి బస్సులను ఎంపిక చేశారు. వీటిలో చాలా వరకు తిరుమలకు వెళ్లే బస్సులే. గురువారం ఉదయం 7 గంటలకే ఈ బస్సులు చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరాయి. ప్రయాణం రద్దయిందని తెలిసి తిరిగి ఆయా డిపోలకు బస్సులు చేరాయి. మెయింటనెన్స్ చేసుకొని మళ్లీ రోడ్డెక్కే సరికి సాయంత్రమైంది. ఈ మధ్యలో తిరుమలకు బస్సుల ట్రిప్పులు తగ్గాయి.

అన్నప్రసాద ట్రస్టు కార్పస్ నిధులు
బాగా పెరిగాయ్ : టీటీడీ ఈవో



తిరుమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం నాణ్యత, రుచులపై ప్రపంచవ్యాప్తంగా భక్తుల నుంచి వస్తున్న స్పందన కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ట్రస్టు కార్పస్ నిధులు చాలా బాగా పెరిగాయని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద భవనంలో గురువారం సాయంత్రం ఆయన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా భక్తులతో మాట్లాడి దర్శన సమయాలు, టోకెన్ విధానం, క్యూలైన్ సౌకర్యాలు, అన్నప్రసాదం రుచి, తిరుమలలోని వివిధ పాయింట్ల వద్ద అన్నప్రసాదాల పంపిణీ తదతర అంశాలపై సమాచారం సేకరించారు. అలాగే వంటశాల, స్టోర్ రూమ్, జీడిపప్పు బ్లాక్స్‌లను పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అన్నప్రసాద కేంద్ర సిబ్బంది, శ్రీవారిసేవకులతో కూడా మాట్లాడారు. అన్నదాన కార్యక్రమం 1985లో ప్రారంభమై, 1994లో అన్నప్రసాదం ట్రస్టుగా ఏర్పడిందన్నారు. 2020 వరకు ఈ కార్యక్రమం నడవడానికి టీటీడీ గ్రాంట్ ఇస్తూ వచ్చిందని, ఆతర్వాత స్వయం సమృద్ధిని సాధించిందన్నారు. ఏటా విరాళాలు పెరగుతున్నాయన్నారు. 2023-24లో కార్పస్ రూ.1,854 కోట్లు, 2024-25లో రూ.2127 కోట్లు, 2025 ఆగస్టు వరకు రూ.2,263 కోట్లకు చేరిందన్నారు. వడ్డీల రూపంలో 2024లో రూ.221 కోట్లు, 2025లో రూ.270 కోట్లకు పెరిగిందన్నారు. ప్రస్తుత వార్షిక వ్యయం రూ.150 కోట్లు ఉందన్నారు. రూ.కోటి విరాళదాతలు కూడా పెరిగారని, 2023-24లో 14 మంది ఉంటే, 2024-25లో 25 మంది, ఈ సంవత్సరం ఐదు నెలల్లో 14 మంది రూ.కోటికిపైగా విరాళాలు అందజేశారని వివరించారు. ప్రస్తుతం తాము వార్షిక బ్రహ్మోత్సవాలపై దృష్టిసారించామని, భక్తుల అభిప్రాయాలు, ఈ-మెయిళ్లు, డయల్ యువర్ ఈవో, వాట్సాప్, సర్వే, ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చే సూచనలు వ్యవస్థలో అవసరమైన చోట సవరణలు చేయడానికి కీలకంగా ఉపయోగపడుతున్నాయన్నారు. ఈతనిఖీల్లో అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు



మంగళం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపంలోని మంగళం అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి, ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ మామండూరు నుంచి కరకంబాడీ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తూ గురువారం తెల్లవారుజామున మంగళం సమీపంలోని గ్రాండ్‌వరల్డ్ వెనుక వైపునకు చేరుకున్నారు. కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ వారి కంటబడ్డారు. పారిపోయే ప్రయత్నం చేయగా వెంటబడి ఇద్దరిని పట్టుకున్నారు. వారు తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. దుంగలతో సహా టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హజరత్ నాందేడ్-తిరుచానూరు మధ్య మరో 4 రైలు సర్వీసులు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు18(ఆంధ్ర జ్యోతి): తిరుపతిలో నెలకొన్న రద్దీని దృషిలో ఉంచుకుని హజరత్ నాందేడ్-తిరుచానూరు మధ్య మరో 4 సర్వీసులు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు (07039) నాందేడ్‌లో ఈ నెల 23, 30 తేదీల్లో ఉదయం 8గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.40 గంటలకు తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటాయి. తిరుచానూరులో ఈనెల 24, అక్టోబరు 1 తేదీల్లో ప్రత్యేక రైలు(07040) సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు హజరత్ నాందేడ్‌కు చేరుకుంటాయి. ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బ్రిక్స్ స్కిల్ టెక్నాలజీలో కాంస్య పతకం
బ్రెజిల్‌లో మెరిసిన పద్మావతి వర్సిటీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్రెజిల్‌లో నిర్వహించిన బ్రిక్స్ స్కిల్స్ డెవెలప్‌మెంట్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంపిటేషన్‌లో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.రమాజ్యోతి కాంస్య పతకాన్ని సాధించారు. ఫుడ్ ప్యాకేజింగ్‌లో బయో ప్యాక్ వ్యవస్థపై ఆమె ప్రదర్శన ఇచ్చారు. కాంస్య పతకాన్ని పొందారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, డైరెక్టర్ మల్లికార్జున అభినందించారు.



రమాజ్యోతిని అభినందిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా ఏపీ
ఆర్ అండ్ డీ కాన్‌క్లేవ్‌లో డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి



ఇన్నోవేషన్, ఆర్‌అండ్‌డీ కాన్క్లేవ్‌లో పాల్గొన్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా మారడానికి ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి చెప్పారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ 2వ ఎడిషన్ ఇన్నోవేషన్, ఆర్ అండ్ డి కాన్‌క్లేవ్ స్థానిక ఓ హోటల్లో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా వర్చువల్‌గా హాజరైన సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి అత్యాధునిక ఉత్పత్తులను అందించేలా పనిచేయాలని యువతకు సూచించారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి భాస్కర్ కాటంనేని వర్చువల్‌గా మాట్లాడారు. వ్యవస్థాపకతను పెంపొందించడం, 20వేల స్టార్టప్‌లను సృష్టించడం, రాబోయే ఐదు సంవత్సరాలలో లక్ష ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా ప్రభుత్వం ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీని ప్రారంభించిందని చెప్పారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ గత చైర్మన్ డి.రామకృష్ణ, పుష్పిత్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పుష్పిత్ గార్గ్, విప్రో లిమిటెడ్ ఏఐ గ్లోబల్ డెలివరీ హెడ్ రఘువీరన్, క్యాప్ జెమిని ఇన్వెంట్ సీనియర్ డైరెక్టర్, ఇంటెలిజెంట్ ఇండస్ట్రీస్ మురళి చంద్రహాసన్ పారిశ్రామికవేత్తలు మలార్‌విలి, విజయ్‌కర్ల, వికాస్ నరహరి, డి.దామోదర్‌నాయుడు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దక్షిణ మధ్య రైల్వే ఎస్‌డీజీఎం పర్యటన

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు18(ఆంధ్ర జ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజరు చేతననంద్ సింగ్ శనివారం గుంతకల్లు డివిజన్‌లో పర్యటించ నున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. శుక్రవారం 17652 ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి శనివారం ఉదయం 3.55 గంటలకు తిరుపతి చేరుకుని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేస్తారు. 9.15 గంటలకు రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకుని 22158 ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 14.10 గంటలకు గుంతకల్లు చేరుకుని సీనియర్ స్కేల్ అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి సికింద్రాబాదుకు చేరుకుంటారు.

స్క్రాబ్ శిల్పానికి.. విగ్రహానికి
తేడా తెలియని భూమన
టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ విమర్శ



తిరుపతి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి మహావిష్ణువు విగ్రహానికి, స్క్రాబ్ శిల్పానికి తేడా తెలియడంలేదని, ఆయనకు నిజంగా హిందూ ధర్మంపై నమ్మకం ఉంటే దాన్ని ఇంట్లో పెట్టుకోవాలని టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ వ్యాఖ్యానించారు. తిరుపతిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'స్క్రాబ్ శిల్పానికి ఇంట్లో నిత్యకైంకర్యాలు చేయాలి. సంప్రదాయాలు, ఆచారాలతో భూమన వ్యాపారం చేశారు. కార్పొరేట్ దళారులను పెంచి పోషించింది ఆయనే. ఆయన హయాంలో అర్చనానంతర దర్శనం (ఏఏడీ) టికెట్లు విక్రయించి కోట్లు సంపాదించారు. కల్యాణోత్సవం పేరుతో కమీషన్లు నొక్కారు. దేవుడి నగలతో ఎగ్జిబిషన్ పెట్టాలన్న దుర్బుద్ధి ఆయనకే సాధ్యం. కేవలం రాజకీయ లబ్ధికోసం టీటీడీని వాడుకుంటున్నాడు. జగన్ ప్రోద్బలంతోనే టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నాడు. ఆయన బూటకపు మాటలను ప్రజలు నమ్మరు. వెంకటేశ్వర స్వామితో ఆటలాడినవారందరూ తగిన మూల్యం చెల్లించుకున్నారు' అని ఆయన దుయ్యబట్టారు.

బ్రహ్మోత్సవాలకు ముందు అలజడికి భూమన అజెండా
టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి

తిరుమల, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు అలజడి సృష్టించడానికి భూమన కరుణాకరరెడ్డి రహస్య అజెండాతో ఉన్నారనే అనుమానం కలుగుతోందని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శ్రీవారి ఆలయం ముందు గురువారం మీడియాతో మాట్లాడుతూ, అలిపిరి విగ్రహం ప్రచారంపై 41 నోటీసు ఇస్తే, 23న వస్తానని చెప్పడం వెనుక ఏదో ఉందనే అనుమానం కలుగుతోందన్నారు. 'శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించేందుకు 24న సీఎం చంద్రబాబు తిరుమలకు రాబోతున్నారు. ఆ ముందురోజు వస్తానని పోలీసులకు చెప్పడం వెనుక రహస్య అజెండా ఉండచ్చు' అన్నారు. కరుణాకరరెడ్డి వంటి వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భక్తుల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఆయనకు ఎలా బుద్ధి చెప్పాలో టీటీడీకి తెలుసన్నారు.